76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21

'రాజధాని వార్తలు' పేపర్‌లో ప్రకటనల కొరకు
సంప్రదించండి
94406 62699
76809 94755
www.rajadhanivartalu.com

# రాజధాని వార్తలు

Voice of Voiceless



ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
చైర్మన్‌గా ప్రమాణస్వీకారం
చేయనున్న
యం. ఎ. షరీఫ్ గారికి
అభినందనలు
- అబ్దుల్ అలీమ్

అమరావతి సంపుటి : 4 సంచిక 20, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 4 - ఆదివారం 10 ఫిబ్రవరి, 2019

వివరాలు2లో...



అమెరికా 'షట్‌డౌన్'కు తాత్కాలిక విరామం

వివరాలు3లో...



వైకల్యానికి ఓటమి

వివరాలు4లో...



మూగబోయిన సోషలిస్టు కంఠం

వివరాలు4లో...



అమెరికాలోని తెలుగు విద్యార్థులకు సాయం చేస్తాం

# బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావనే లేదు

## చంద్రబాబు ఫైర్



**రాజధాని వార్తలు, అమరావతి :** చివరి బడ్జెట్‌లో కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహమే చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అనే మాటే ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. రోజుకు 16 రూపాయలు ఇస్తే రైతులకు ఒరిగేదేమీ లేదని విమర్శించారు. 5ఎకరాల భూమి ఉంటే 500 రూపాయలు భిక్ష వేస్తారా అని కేంద్రాన్ని ప్రశ్నించారు. కేంద్రబడ్జెట్ పేదలపై ఏమాత్రం ప్రభావం చూపలేదని, పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి కేంద్ర బడ్జెట్ లో సామాన్యులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఈబీసీ రిజర్వేషన్ల ఆదాయ పరిమితి 8లక్షల రూపాయలు ఉంటే.. ఆదాయపన్నుకు మాత్రం 5లక్షలు పెట్టారని ఇటువంటి విరుద్ధతలు అనేకం ఉన్నాయన్నారు. దేశంలో నిరుద్యోగంపై చైనా కూడా హెచ్చరించిందన్న సీఎం మన రాష్ట్రంలోనే 14లక్షల మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. ఒక్క 'కియా' లోనే వేలాదిమందికి ఉద్యోగాలు లభించాయన్నారు. భాజపా వైఫల్యం వల్లే దేశంలో నిరుద్యోగ సమస్య ఏర్పడిందన్నారు. శాసనసభలో నిన్నటి రోజు చరిత్రలో నిలిచిపోనుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. వందలాది ఎమ్మెల్యేలు నల్ల చొక్కాలతో నిరసన తెలపటం ఎప్పుడూ జరగలేదన్నారు. ఢిల్లీలో మన ఎంపీలు నల్లచొక్కాలతో ధర్నా చేశారని తెలిపారు. రాష్ట్రంలో జేఏసీ బంద్ విజయవంతమైందన్నారు. అన్యాయాన్ని నిలదీసేందుకే ఈ తీవ్ర నిరసనలన్నారు.

ఆటోలపై జీవితకాల పన్ను రద్దు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి పెద్దసంఖ్యలో ఆటో డ్రైవర్లు తరలివచ్చారు. పన్ను ఎత్తివేత నిరయంపై ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందరరేగా చంద్రబాబు ఆటో డ్రైవర్లనుద్దేశించి మాట్లాడారు. తన జీవితానికి ఆటో డ్రైవర్ల జీవితానికి ఎన్నో దగ్గర పోలికలు ఉన్నాయన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని డ్రైవర్లు పోషిస్తుంటే రాష్ట్రాన్ని నడుపుతూ ప్రజల సంక్షేమాన్ని తాను చూస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ఆటోవాలాలకు ముఖ్యమంత్రి మరిన్ని వరాలు కురిపించారు. ఆటో డ్రైవర్ చొక్కా ధరించి తన నివాస ప్రాంగణంలో స్వయంగా ఆటో నడిపి అందరిలోనూ హుషారు నింపారు. ఇంధన ఛార్జీలు, ఇన్సూరెన్స్ భారం కూడా తగ్గించేలా చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. ఆటోడ్రైవర్లందరికీ పెద్దన్నగా తానుంటానన్నారు. 'ప్రయాణికుల క్షేమం మీరు చూసుకోండి.. మీ క్షేమం నేను చూసుకుంటాను' అని వారితో సీఎం అన్నారు.

# రైతుల్లో ఆందోళన



**రాజధాని వార్తలు, అమరావతి :** రుణమాఫీ కోసం రైతులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు మూడు దఫాలుగా దాదాపు రూ.10 వేల కోట్లు విడుదల చేసింది. దీంతో దాదాపు 35 లక్షల మంది రుణాలు మాఫీ అయ్యాయని చెబుతుండగా, మరో 23 లక్షల మంది రైతులు ఇంకా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని 58 లక్షల మందికి రూ.24 వేల కోట్ల రూపాయలు ఉపశమనం పథకంలో మాఫీ చేస్తున్నామన్న ప్రభుత్వం రాష్ట్రఆర్థిక పరిస్థితి తీవ్రలోటులో ఉండటంతో నిధుల విడుదల సాధ్యం కావడంలేదనడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. ఏపీలో సార్వత్రిక ఎన్నికల ముందు రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి టీడీపీ అధికారంలోకి వచ్చింది. 58లక్షల మందికి రూ.24 వేలకోట్లు రుణ ఉపశమన పథకంలో మాఫీ చేస్తున్నామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు మూడు దఫాలుగా రూ.15వేలకోట్లు విడుదల చేసి 35లక్షల మంది రైతుల రుణాలను మాఫీ చేసింది. ఇంకా 23లక్షల మంది రైతులకు వడ్డీతో కలిపి దాదాపు రూ.10వేలకోట్లు విడుదల చేయాల్సి ఉంది. దీనికి సంబంధించిన బాండ్లను సైతం ప్రభుత్వం రైతులకు ఇచ్చింది. అయితే ప్రభుత్వం వద్ద తగిన సొమ్ములు లేకపోవడం వలన నిధులు విడుదల చేయలేకపోతోంది. దీంతో రైతన్న తీవ్ర ఆందోళన చెందుతున్నాడు.

### ఈ నెల్లో ఎన్నికల నోటిఫికేషన్

ఈ నెలలో సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే ప్రభుత్వం చేసే చాలా సంక్షేమ కార్యక్రమాలకు బ్రేక్ పడుతుంది. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చేలోపే నిధులను బ్యాంకులకు ఇవ్వాలని రైతాంగం డిమాండు చేస్తోంది. ఈ పథకం కింద గ్రామాల్లో కొంత మంది రైతుల రుణాలను మాఫీ చేసి మరికొందరికి చేయకపోవడం వలన రైతన్న ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు.

### రూ.50వేలలోపు ఒకేసారి మాఫీ

రాష్ట్రంలో రూ.50వేలలోపు రుణబకాయిలున్న రైతుల రుణాలను ఒకేసారి మాఫీ చేశారు. ఇలా 35లక్షల మంది రైతులు లబ్ధిపొందారు. కుటుంబానికి రూ.1.50లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం సీలింగ్ విధించింది,అయితే

- మిగతా 2 లో

# నిమ్రాలో ఏం జరుగుతుంది ?




**రాజధాని వార్తలు, విజయవాడ :** పేరుకు మైనారిటీ కాలేజ్...కానీ మైనారిటీ విద్యార్థులకు శాపం. అడుగు అడుగునా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం నిమ్మ్రా మెడికల్ కాలేజ్, పార్మసీ కాలేజ్‌లలో ప్రభుత్వ నిబంధనలు అమలు అవుతున్నయా ? అసలు ఎం జరుగుతుంది ? యాజమాన్యంను తప్పు దోవ పట్టిస్తున్నది ఎవరు? గత్యంరం లేక చదువుతున్నాం. అంటున్న విద్యార్థులు ..కనీస వసతులు లేకున్నా మెడికల్ కాలేజ్ నడుపుతున్నారు అన్న ఆరోపణలకు కాలేజ్ యాజమాన్యం ఎం చెపుతుంది? విద్యార్థులు చెలించే ఫీజులకు రసీదులు ఎందుకు ఇవ్వరు. నిమ్రా కాలేజీ అవకతవకలపై నిజాలు త్వరలో మీ రాజధాని వార్తలలో.

# 7న మీడియా హౌస్ ప్రారంభం






**రాజధాని వార్తలు, విజయవాడ :** నగరంలోని బెంజిసర్కిల్ వద్ద బందరు రోడ్డులో ఉన్న బిగ్‌సీ వెనుక శ్రీ సాయి నివాస్ లో మీడియా హౌస్ ప్రారంభం కానుంది. ఈనెల 7 సాయంత్రం 6 గంటలకు శాసనమండలి ఛైర్మన్ డెసిగ్నేట్ ఎంఎ షరీఫ్ దీనిని ప్రారంభించనున్నారని మీడియా హౌస్ ఛైర్మన్ హుస్సేన్ ఖాన్ వెల్లడించారు. 50 మందికి సరిపడా ఏసీ సమావేశ హాలు, వీడియో ఆడియో రికార్డింగులు, ప్రజెంటేషన్ ప్రొజెక్టర్ ఇందులో సమకూర్చామన్నారు. సన్నిహితులతో నిర్వహించుకునే పుట్టినరోజు వేడుకలు, మీడియా సమావేశాలకు ఇది అనుకూలంగా ఉంటుందన్నారు. కార్పొరేట్ సమావేశాలు, ప్రమోషన్, డీలర్ మీటింగులు, ఉత్పాదన ప్రారంభోత్సవాలు, సెమినార్లు, శిక్షణకేంద్రంగా ఇది ఉపయోగ పడుతుందన్నారు. అంతేకాకుండా బుక్ రిలీజ్, ప్రెస్ కార్యక్రమాలు, మీడియా సంబంధాలు, ప్రకటనలు, మీడియా కన్సల్‌ట్టింగ్, మినీ ఫంక్షన్ల కోసం అందరికీ అందుబాటులో ఉండే విధంగా దీన్ని రూపొందించామని ఖాన్ తెలిపారు. వివరాలకు VMEDIAHOUSE.COM సంప్రదించండి.



ఫిబ్రవరి 7న అమరావతిలో వి. మీడియా హౌస్
ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న
శాసనమండలి ఛైర్మన్ (డెసిగ్నేట్) యం.ఎ షరీఫ్ గారికి
ముఫ్తి మహ్మద్ ఫారూఖ్ గారికి
స్వాగతం - సుస్వాగతం
వివిధ ప్రాంతాల నుండి విచ్చేస్తున్న ప్రముఖులకు,
నాయకులకు, ప్రాతికేయ మిత్రులకు సుస్వాగతం
VASTITUDE
MEDIA HOUSE
www.vmediahouse.com
ప్రెస్ మీటింగ్స్, మీడియా రిలేషన్స్ & మీడియా ప్రకటనలు
# 7386 000 779, 9440 662 699, 7680 994 755
# : 40-5/6-8/1, 1st Floor, Opp.P & T Quarters,
M.G.Road, VIJAYAWADA-520 010.

## రాజధాని వార్తలు కలం

# విద్యావైద్యానికి మొండిచేయి

విద్య జాతీయ సంపద.. దేశాభివృద్ధి, ఆర్థిక ప్రగతికి వెన్నెముక. అలాంటి విద్యా,వైద్య, ఉపాధి రంగాలకు కేంద్రం బడ్జెట్‌లో కెటాయింపులు జరపకపోవడం విషాదం. కేవలం దేశంలోని 35 కోట్ల మంది ఓటర్లను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ తయారు చేయడం దేశ భవిష్యత్‌ను అడ్డుకోవడమే. రెండున్నర లక్షల ఆదాయపరిమితిని ఐదు లక్షలకు చేయడం గృహరుణాలు ఇంటి అద్దెలు, ఇన్సూరెన్స్‌లు కలిపి 6.50 లక్షలు మంది ఉద్యోగులు లబ్దిపొందుతారని చెప్పడం రాజకీయ గిమ్మిక్కే. రాబోయే ప్రభుత్వంపై ఈ భారం పడుతుంది. ఐదులక్షల వరకు పన్ను పరిమితిని విధించిన కేంద్ర ప్రభుత్వం అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి కల్పించిన విద్యా,ఉద్యోగ రిజర్వేషన్లలో రూ.8 లక్షలను చేయడం సమర్థనీయం కాదు. కార్మికులు అనేక పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగుకే పరిమితం చేసి వారి హక్కులను కాలరాస్తున్న కేంద్రం గోవుల కోసం రూ.750కోట్లను ప్రకటించి, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు అందించే పింఛనుకు కేవలం రూ.500 కోట్లను మాత్రమే కేటాయించింది. 'ప్రధానమంత్రి శ్రమయోగి బంధన్' పేరిట ప్రకటించిన ఈ పథకం అసంఘటిత రంగంలో పని చేస్తున్న 10 కోట్ల మందికి వర్తింపజేస్తామని కేంద్రం ప్రకటించింది. వాస్తవానికి దేశవ్యాప్తంగా అసంఘటిత కార్మికులు 45 కోట్ల మంది ఉన్నారు. ఈ పథకంలో చేరేవారు(29 ఏండ్ల లోపు) నెలకు రూ.100లు ప్రీమియం చెల్లించాలి. 60ఏండ్లు నిండిన తర్వాత వారికి రూ.3వేలు చెల్లించనున్నారు. ఇది ఇన్సూరెన్స్ కంపెనీలకు బాగా కలసి వచ్చే అంశం.

నేడు దేశం ఎదుర్కొంటున్న అత్యంత కీలక సమస్య నిరుద్యోగం. 2017-18లో నిరుద్యోగిత రేటు 6.1శాతానికి చేరిందనీ, ఇది 45ఏళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి చేరుకుందని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నివేదిక వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ సమస్య 2019లో 8 శాతానికి కూడా తాకవచ్చని సర్వే అంచనా వేసింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే మోడీ సర్కారు ఆ సర్వే వివరాలను ప్రచురించడానికీ, ప్రకటించడానికి కూడా అనుమతించలేదు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన చేస్తామని గత ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకున్న బీజేపీ నిర్వాకం ఇది. 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పేరిట సరికొత్త పథకాన్ని ప్రకటించింది. 2018 డిసెంబరు 1 నుంచే ఇది అమల్లోకి వచ్చినట్లు మోడీ సర్కారు బడ్జెట్‌లో ప్రకటించింది. దీని ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 12కోట్ల మంది సన్న, చిన్నకారు రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. తొలి విడతలో భాగంగా 1 డిసెంబరు 2018 నుంచి 31 మార్చి 2019 మధ్యకాలానికి రూ.2వేలు రైతుల ఖాతాలో జమ కానుంది. ఈ పథకం అమలుకై ఏడాదికి రూ.75వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుందని మోడీ సర్కారు తెలిపింది. తొలి విడత మొత్తం 2019 ఎన్నికలకు ముందుగానే రైతుల బ్యాంకు ఖాతాలోకి జమ అవుతాయి. దీంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా గ్రూపులకు పసుపు కుంకుమ కింద ఎన్నికల ముందు రూ.10 వేలు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ రైతు బంధుపేరుతో ఏడాదికి రూ. 8 వేలు ప్రకటించిన విషయం గుర్తుకు వస్తుంది. ఒడిశాలో కలియా పేరుతో ఏడాదికి రూ.10 వేలు చొప్పున అక్కడి ప్రభుత్వం రైతులకు అందిస్తోంది. జార్ఖండ్ ప్రభుత్వం 'కృషి యోజన పథకాల'తో రైతులకు భరోసా ఇస్తున్నారు. అయితే కౌలు రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చకపోవడం గమనించాల్సిన విషయం. వాస్తవానికి స్వామినాథన్ కమిషన్‌ను అమలు చేస్తామన్న ప్రధాని మోడీ ప్రస్తుతం ఈ కేటాయింపులతో ఎన్నికల ముందు ఎంగిలి మెతుకులు విసురుతున్నారన్నది సుస్పష్టం. గ్రామీణ ఉపాధి పథకానికి కెటాయింపులు పెరగక పోగా గతేడాది కంటే రూ.1,084 తగ్గించారు.

వైద్యం, ప్రాథమిక విద్య, ఉన్నత విద్య,పరిశోధనల కోసం కేటాయింపులు జరగక పోవడం, యువత ఉపాధిని పూర్తి విస్మరించడం కేంద్రానికి తగదు. ఎందుకంటే 2019 ఎన్నికల్లో 13 కోట్ల మంది మొదటిసారి ఓటు వేయబోతున్నారు. వారందరూ ప్రతీకారాని దిగితే బీజేపీ గల్లంతే..

## రైతుల్లో ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబంలో ఒక్క సభ్యునికే రూ.50వేలలోపు మాఫీ అయిన తర్వాత మిగిలిన వారికి సొమ్ములు విడుదల కాలేదు. అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బాండ్లపై పదిశాతం వడ్డీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే దీనిపై ఏ మేరకు ఇస్తోందో తెలియడంలేదని రైతులు వాపోతున్నారు.

**నాలుగు, ఐదో ఒకే పర్యాయం**

అయితే నాలుగు, ఐదో విడత సొమ్ములను ఒకే పర్యాయం విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ప్రభుత్వంలో ఒక కీలక అధికారిచెబుతున్నారు. ఫిబ్రవరి రెండోవారంలో రైతుల నుంచి బాండ్లు స్వీకరించి వడ్డీతో సహా చెల్లించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇదే జరిగితే రైతుల నుంచి రాష్ట్రప్రభుత్వంపై వచ్చే వ్యతిరేకత తగ్గుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## చిగురుపాటి జయరామ్‌పై విష ప్రయోగం?

**హైదరాబాద్ :** కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ చిగురుపాటి జయరామ్‌పై విష ప్రయోగం జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృత దేహం నీలం రంగులోకి మారడంపై పోలీసులు దృష్టి సారించారు. శాంపిల్స్‌ను ఫోరన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. దర్యాప్తులో భాగంగా శనివారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జయరామ్ ఇంటికి చేరుకున్న నందిగామ పోలీసులు జయరామ్ మేనకోడలు శిఖా చౌదరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రెండేళ్ల క్రితం జయరామ్ తల్లి మృతి చెందినప్పటి నుంచి కుటుంబంలో ఆస్తి గొడవలు మొదలయినట్లు సమాచారం. దీంతో పోలీసులు జయరామ్ కుటుంబసభ్యులు, బంధువులను ప్రశ్నిస్తున్నారు.జయరామ్ హత్య అటు ఏపీ, ఇటు తెలంగాణలో కలకలం రేపుతోంది. కృష్ణాజిల్లా, నందిగామ సమీపంలోని ఐతవరం గ్రామం శివారులో 65వ నెంబరు జాతీయరహదారి పక్కన శుక్రవారం తెల్లవారుజామున జయరామ్ మృత దేహం లభ్యమైంది. హైదరాబాద్ నుంచి ఆయన విజయవాడకు వస్తుండగా ఈ హత్య జరిగినట్లు భావిస్తున్నారు. ఆయన కారు డ్రైవర్ సతీష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రశ్నిస్తున్నారు. విజయవాడకు చెందిన జయరామ్.. భార్య పద్మజా ఇద్దరు పిల్లలతో కలిసి అమెరికాలోని ఫ్లోరిడాలో స్థిరపడ్డారు. ఆయనకు బ్యాంకింగ్, ఫార్మా రంగాల్లో పలు వ్యాపారాలు ఉన్నాయి. కృష్టాజిల్లా కేంద్రంగా ఏర్పాటైన కోస్టల్ బ్యాంక్‌కు ఆయన డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ టీవీ ప్రారంభించి మీడియా రంగంలోకి ప్రవేశించారు. ప్రస్తుతం ఆ ఛానల్ మూతపడింది.

## అమెరికా 'షట్‌డౌన్'కు

# తాత్కాలిక విరామం

**ఈ ఏడాది అమెరికా పౌరులు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అధ్యక్షుడు ట్రంప్ మొండి నిర్ణయాలతో వారికి ఈ పరిస్థితి దాపురించింది. అమెరికా- మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధుల కోసం ఆయన పట్టుబట్టడంతో క్రిస్మస్‌కు 2 రోజుల ముందే ఆమెరికా ఆర్థికంగా స్తంభించింది. పారిశుద్ధ్యం పనులు ఎక్కడివక్కడే నిలిచిపోగా, మ్యూజియం, పబ్లిక్‌పార్కులకు తాళాలు వేశారు. సుమారు 10 లక్షల మంది కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించ లేదు. అత్యవసర సేవల్లో పాల్గొనే 4 లక్షల మంది కార్మికులు ఎటువంటి జీత భత్యాలు లేకుండా 35 రోజులపాటు పనిచేశారు. జనవరి 26 నుంచి రాజకీయ ఒత్తిడికి తలొగ్గిన ట్రంప్ తాత్కాలికంగా షట్‌డౌన్‌ను విరమించి ఫిబ్రవరి 15 వరకు ప్రభుత్వం నడిచేందుకు నిధుల విడుదలకు అమోదం తెలిపారు.**





**దీంతో 8 లక్షలమంది ఫెడరల్ ఉద్యోగులకు ఈనెల వేతనాలు అందనున్నాయి. అమెరికా - మెక్సికో మధ్యన గోడ లేదా ఉక్కు కంచె తప్పనిసరి లేదంటే మరోసారి షట్‌డౌన్ తప్పదని ట్రంప్ చేసిన హెచ్చరిక అమెరికా వాసులను కలవర పెడుతోంది.**

క్రిస్మస్ రోజుల్లో వేతనాలు లేకుండానే పని చేసిన 4 లక్షల మంది పారిశుద్ధ్య కార్మికులు దుర్భర పరిస్థితిని ఎదుర్కొన్నారు. స్థానిక సంస్థలు వారికున్న నిధుల అందుబాటు ననుసరించి నగర ప్రధాన వీధులను శుభ్రం చేశారు. వాషింగ్టన్ మేయరు వారానికి 46 వేల డాలర్లతో రోడ్లను ఊడ్పించారు. స్టాట్యు ఆఫ్ లిబర్టీ సందర్శకులకు అందుబాటులో ఉంచటానికి న్యూయార్క్ గవర్నరు రోజుకు 65 వేల డాలర్లను వెచ్చించారని బీబీసీ రాసింది. చిన్న పట్టణాలు మాత్రం తీవ్ర ఇబ్బందుల పాలయ్యాయి. హొటళ్లు, రెస్టారెంట్లు, చిన్న దుకాణదారులు బోసిపోయి గంటల తరబడి మూసివేశారు. నేషనల్ సైన్స్ ఫౌండేషన్ వంటి సంస్థల్లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు నిధులు లేక పనులను ఆపేశాయి. అడ్వాన్స్‌మెంట్ సైన్స్ అసోసియేషన్ శాస్త్రవేత్త ఒకరు 'పరిశోధన కార్యకలాపాల్ని మొత్తంగా మూసివేసి, ప్రాజెక్టుల నిర్వహణలో పురోగతి సాధించలేని స్థితికి చేరుకొన్నామన్నారు. అమెరికా షట్‌డౌన్‌తో విమాన ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది అవస్తల పాలవ్వటంతో రోజుకు 45 వేల విమానాలు ఎగరటం కష్టంగా మారింది. నిధుల లేమితో వ్యవసాయ పనులు సాగ లేదు. మొత్తం మీద అమెరికాలో అంతరంగిక భద్రతా డిపార్టుమెంటు, న్యాయవ్యవస్థ, గృహనిర్మాణాలు, వ్యవసాయం, ట్రెజరీ, కామర్స్ మొదలగు 9 డిపార్టుమెంట్లు నడవలేని స్థితిలో సోషల్ మీడియాలో ప్రజానీకం తీవ్ర నిరసనల్ని తెలియజేశారు.దీంతో ట్రంప్ తాత్కాలికంగా షట్ డౌన్‌కు బ్రేక్ ఇచ్చారు.

ఈ సంక్షోభానికి ప్రధాన కారణం అమెరికా – మెక్సికోలకు మధ్య సరిహద్దు గోడను నిర్మించటానికి ట్రంప్ నిధులను విడుదల చేయమని ఒత్తిడి తేగా, కాంగ్రెస్ మొత్తం ఖర్చులను, నిధుల విడుదలను ఆపేసింది. దీంతో పరిస్థితి తీవ్రమైంది.

**షట్ డౌన్ గురించి..**

ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వం స్తంభనకు గురికావటం ఇది మూడవసారి. అదీ 2018లోనే కావటం విశేషం. 2018 జనవరిలో మొదటిసారిగా 3 రోజులు, ఫిబ్రవరిలో 2 రోజులు, డిసెంబర్‌లో ప్రారంభమై నేటికి 18 రోజులు దాటినా ఇంకా ఎటూ తేలని మూడవసారి ప్రభుత్వ ఆర్థిక సంక్షోభం. 1995 సంవత్సరంలో ఎక్కువకాలం 21 రోజులతో బిల్‌క్లింటన్ సమయంలో జరిగింది. కాగా 1981 సంవత్సరం నుండి గడచిన 37 సంవత్సరాలలో మొత్తం 15 సార్లు యూ.ఎస్. ప్రభుత్వం 'షట్‌డౌన్'కు గురైంది.

ఆర్థిక స్తంభనతో హోమ్‌మంత్రిత్వ శాఖ ద్వారా సహాయం పొందుతున్న 20 లక్షల దేశీయ అమెరికా తెగల ప్రజలతోపాటుగా, లక్షలాది బీద అమెరికన్లు పొందే ఫుడ్‌స్టాంఢ్స్( రేషన్ టోకెన్లు) ఆగిపోయి ఆకలితో అలమటించారు. అమెరికా కాంగ్రెస్ హౌస్ సభాధ్యక్షురాలు నాన్సీ పెలోసీ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రస్తుతం ట్రంప్ విధానాలతో అమెరికా ప్రభుత్వం మూతబడుతుందని, కేవలం ట్రంప్ గొంతు మాత్రమే అమెరికా అంతటా నియంతలా వినబడుతుందన్నారు. ట్రంప్ చెబుతున్నట్లుగా మెక్సికో సరిహద్దు నుండి గోడల నిర్మాణం అనేది మనుషులకు మనస్సులకూ మధ్య సృష్టించబడేవి. దోపిడీదారుల సంపదను రక్షించుకోవటానికి నిర్మించుకొనేవి. ఆర్థిక అసమానతల మధ్య, దోపిడీ దేశాలు – దోచుకోబడే దేశాల మధ్య జరిగేవి. ట్రంప్ మొండితనం విడిచిపెట్టకుండా 2 వేల మైళ్ల పొడవున 1500 కోట్ల డాలర్లతో కట్టి తీరుతానని భీష్మించి కూర్చున్నారు. అవసరమైతే తన అధికారాలతో మిలిటరీ నిధుల్ని మళ్లించి యుద్ధ ప్రాతిపదికన గోడను నిర్మిస్తానంటున్నారు. మూర్ఖపు నేతలతో ప్రజలు అవస్తలు వర్ణనాతీతం.

ఉగ్రవాదుల ప్రవేశం లేదు. ప్రపంచబ్యాంకు ఐఎమ్ఎఫ్ బ్యాంకుల షరతుల మధ్య నలిగిపోయిన కొద్దిమంది ఉద్యోగాన్వేషణలో అమెరికాకు వస్తున్నారు. మెక్సికన్లు తరతరాల నుండి వ్యవసాయ ఉపాధి కోసం ఆయా సమయాల్లో అమెరికా వెళ్లి వారి స్వగ్రామాలకు తిరిగి రావటం పరిపాటి. పైగా ఇప్పటి దక్షిణ, పడమర భాగాల్లోని అమెరికా ఒకప్పటి మెక్సికోయే.. స్పెయిన్ సామ్రాజ్యం, బ్రిటీష్ సామ్రాజ్యం మెక్సికోను కబళించాయి. ప్రస్తుతం అమెరికా ఆక్రమణకు గురయిన ప్రాంతానికే వారు వెళ్లేది.

## అమెరికా గజ..గజ







**న్యూయార్క్:** అమెరికాలో చలి ఎముకలు కొరుకుతోంది. చాలా ఏళ్ల తర్వాత అమెరికాలో ఈ రీతిలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ వారంలో కనిష్ట ఉష్ణోగ్రతలు -53కు పడిపోయే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. న్యూయార్క్, మిన్నెపొలీస్, చికాగో, డెట్రాయిట్, తూర్పు టెక్సాస్ నుంచి ఉత్తర ఫ్లోరిడా వరకు, అలబామా, జాక్సన్‌విల్లే, ఇల్లినాయిస్, మిచిగాన్, విస్కాన్సిన్ తదితర ప్రాంతాల్లో చలి తీవ్రస్థాయికి చేరింది. చికాగోలో ఇప్పటికే -25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 'ప్రాణాలకు అత్యంత ప్రమాదకరమైన చలి'గా దీన్ని అధికారులు ప్రకటించారు. అమెరికాలోని ఐదున్నర కోట్ల మందిపై ఈ చలి ప్రభావం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా చికాగో విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన 600కు పైగా విమానాలను చలి తీవ్రతతో రద్దు చేశారు. చలి నుంచి తమను తాము రక్షించుకోవడం కోసం ప్రజలకు అత్యవరస సూచనలు చేశారు. చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రభుత్వం ప్రయాణాలు వంటివి పెట్టుకోవద్దు,బయట పది నిమిషాల కంటే ఎక్కువ సమయం ఉండొద్దు.బయటకు వెళ్లేటప్పుడు శ్వాస తీసుకోవద్దు. ఇతరులతో తక్కువగా మాట్లాడండి.. ఇంటి తలుపులు, కిటికీలన్నింటినీ మూసివేసి ఉంచండి.. చల్లని నీటితో ముఖం కడుక్కోవద్దు.. గోరు వెచ్చని నీటితో స్నానం చేయండి.. పర్‌ఫ్యూమ్స్, బాడీ స్ప్రేలకు దూరంగా ఉండండి..గదిలో హీటర్లు వాడండి.. పాదాలకు పగుళ్లు రాకుండా ఉండేందుకు రాత్రిళ్లు కూడా సాక్సులు వేసుకోండి.బయటకు వెళ్లినప్పుడు ఉన్ని దుస్తులనే వాడండి. తలను కప్పి ఉంచేలా క్యాప్ లాంటివి కూడా ధరించండి. ఐస్‌క్రీమ్‌ల వంటి వాటి జోలికి పిల్లలు వెళ్లకుండా చూడండి.. లేకుంటే అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకున్నవారవుతారు, నీటిని ఎక్కువగా తాగండి అంటూ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.

# రైల్వేస్టేషన్ ఆవరణలో భారీ అగ్నిప్రమాదం

- కాలిపోయిన కేబుళ్లు
- ప్రమాదానికి కారణంపై అధికారుల దర్యాప్తు

**తిరుపతి:** తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం భారీ అగ్రిప్రమాదం సంభవించింది. రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించి కేబుల్ బండిళ్లు కాలిపోయాయి. సుమారు గంటపాటు ఫైర్ సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేశారు. తిరుపతి రైల్వేస్టేషన్ పరిసరాల్లో రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ పనులు జరుగుతున్నాయి. వీటికి అవసరమైన కేబుల్ బండిళ్లు, ఇతర సామగ్రిని టీటీడీ మూడో సత్రాలకు సమీపంలోని రైల్వే ఖాళీ స్థలంలో ఉంచారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో ఒక బండిల్‌కు నిప్పంటుకుంది. దీనిని గమనించి కూలీ, సహ కూలీలతో కలిసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు.

**ప్లాస్టిక్, రబ్బర్ వస్తువులు కావడం..**


ఆ ప్రదేశంలో ఎండుటాకులు, చెత్తాచెదారం ఉండటంతో మంటలు అదుపుకాలేదు. పక్కనున్న బండిళ్లకూ మంటలు వ్యాపించి ఎగసిపడ్డాయి. కొన్ని మీటర్ల ఎత్తు వరకు దట్టమైన పొగ వ్యాపించింది. రెండు ఫైరింజన్లతో 11మంది ఫైర్‌ఫైటర్లు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. నీళ్లను చల్లడంతో పెద్ద బండిళ్ల పైభాగంలో మంటలు ఆరినా, లోపలినుంచి మంటలు పైకి వ్యాపిస్తూ వచ్చాయి. చివరకు ఫోమ్ ఉపయోగించి మంటలను అదుపుచేశారు. మొత్తం 36 రోల్స్‌లో 13 కాలిపోయాయి. మిగతావీ అంటుకుని ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా ఉండేది. తిరుపతి స్టేషన్ అధికారి ఎం.వెంకటరామిరెడ్డి, ఎల్ఎఫ్ భాస్కరన్, గణపతి, డ్రైవర్ ఆపరేటర్లు శంకర్‌శెట్టి, నాగరాజు, ఫైర్‌మెన్ తిరుమలరెడ్డి, సహదేవనాయక్, రవికుమార్, ప్రకాష్, రమణమూర్తి, రాకేష్ తదితర సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేయడంతో ప్రమాద తీవ్రత తగ్గింది.

**స్థానికుల భయాందోళన**

ఎగిసిన పడిన మంటలతో పక్కనేఉన్న కాలనీ ప్రజలు భయాందోళన చెందారు. మంటల వేడికి కొన్ని ఇళ్ల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఇళ్లపైనుంచి డ్రైన్‌కు వేసుకున్న ప్లాస్టిక్ పైపులు కరిగిపోయాయి. ప్రమాదం మరింత తీవ్రమవుతుందేమోనన్న ఆందోళనతో ఇళ్లలోని గ్యాస్ సిలిండర్లను పలువురు బయటకు తీసుకొచ్చారు. దట్టంగా అలుముకున్న పొగతో.. పెద్ద ప్రమాదమే జరిగి ఉంటుందని ప్రజలు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఇలా చూసేందుకు వచ్చిన వారిని అదుపుచేయడం కష్టంగా మారింది. తిరుపతి ఈస్ట్ సీఐ చంద్రబాబు, రైల్వే డీఎస్పీ రమేష్‌బాబు, సీఐ ఆశీర్వాదం తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపకాధికారులకు తోడుగా పరిస్థితిని పర్యవేక్షించారు. ఘటనా స్థలంలో విద్యుత్తు సరఫరా ఏదీ లేకపోవడంతో షార్ట్‌సర్క్యూట్ కాదని తేలింది. అక్కడ తిరిగేవాళ్లలో ఎవరైనా బీడీ, సిగరెట్ తాగి పడేయడంతో చెత్తాచెదారానికి మంటలు వ్యాపించి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఆకతాయిలు ఎవరైనా కావాలనే నిప్పంటించారనడానికి పెద్దగా అవకాశాలు కనిపించడంలేదని రైల్వే డీఎస్పీ రమేష్‌బాబు పేర్కొన్నారు. దర్యాప్తులో కారణాలను కనుగొంటామన్నారు. కాంట్రాక్టరు ఫోనులోకి అందుబాటులోకి రాకపోవడంతో నష్టాన్ని అంచనా వేయలేకపోతున్నామని జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి ఆదినారాయణరెడ్డి తెలిపారు. నష్టం రూ.లక్షల్లోనే ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు.

# రాజధానికి నిధులివ్వాలి

### తుళ్లూరులో వామపక్షాల డిమాండ్




**రాజధాని వార్తలు, తుళ్లూరు :** రాష్ట్రానికి ప్రత్యేకహోదాతో పాటు రాజధాని అమరావతికి నిధులివ్వాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు తుళ్లూరులో నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక ప్రథమిక ఆరోగ్యకేంద్రం దగ్గరనుంచి ఎర్రజెండాలు చేతబట్టి తపాలా కార్యాలయం వరకు ప్రదర్శన జరిపారు. రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యధోరణి విడనాడాలని, విభజన హామీలను అమలుచేయాలని, రాజధానికి నిధులు ఇవ్వాలని ప్రదర్శనలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తపాలా కార్యాలయం వద్ద సిపిఎం. రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నిరంకుశ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. చెప్పారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి వల్ల దేశంలో అనేక పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. ఫలితంగా ఉద్యోగాలు, ఉపాధి పోగొట్టుకొని కార్మికులు రోడ్డున పడ్డారని చేప్పారు. రైతుల ఆత్మహత్యలు పెరిగామని వ్యక్తం చేశారు. దళితులు, అణగారిన వర్గాలపై బిజెపి పాలనలో దాడులు నిత్యకృత్యమయ్యాని, మోడీ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం తాడికొండ నియోజకవర్గ నాయకులు పచ్చల సాంబశివరావు మాట్లాడుతూ విభజనహామీల అమలులో కేంద్ర ప్రభ్రుత్వం రాష్ట్ర ప్రజలను వంచించిదన్నారు. హోదాతో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ది చెందుతుంద్ది చెందుతుందని, ఫలితంగా ఉద్యోగ, ఉపాధి కల్పనకు అవకాశం ఉంటుందన్నారు. హోదా ఇచ్చేవరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో తాడికొండ సిపిఎం శాఖా కార్యదర్శి చింతల భాస్కరరావు కుంభా ఆంజనేయులు, పేరెం బాబురావు, గడ్డం కృష్ణ, చవల అంకయ్య బెజ్జం గెరటయ్య, సిపిఐ నాయకులు కాబోతు ఈశ్వరరావు, గుర్రంకొండ సత్యానందం, ముప్పాళ్ళ శివశంకరరావు, షేక్ జానీ సాహెబ్, కంభంపాటి స్వామి, కె దేవునిదయ పాల్గొన్నారు.

## ఏపీ విద్యుత్ శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**రాజధాని వార్తలు, అమరావతి :** విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల నియమానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు మంత్రి కళావెంకటరావు చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగం సంస్థల్లో ఖాళీలుగా ఉన్న అన్ని ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని. ముఖ్యంగా విద్యుత్ శాఖలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖలో ఏపి ట్రాన్స్‌కో, ఏపి ఎస్పీడీసీఎల్, ఏపి ఈపీడిసియల్ సంస్థల్లో అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి శుక్రవారం నోటిఫికేషన్లు విడుదల చేశినట్లు తెలిపారు. మొత్తంగా 206 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని దీనిలో 171 పోస్టులు ఏపి ట్రాన్స్‌కో, 20 పోస్టులు ఏపి ఎస్పీడీసీఎల్, 15 పోస్టలు ఏపి ఈపిడిసియల్ ద్వారా నియామక ప్రకటన జారీచేశామన్నారు. విద్యుత్ సంస్థలైన ఏపి ట్రాన్స్‌కో, ఏపిడిస్కమ్స్ సమావేశంలో పెరిగిన విద్యుత్ వినియోగదారుల అవసరాలు, ప్రాజెక్ట్ అవసరాలకు అనుగుణంగా ఈనియామకాలు చేపట్టాలని ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయించామని విద్యుత్ శాఖ మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

## రాయపూడి స్కూల్‌కి ఫైవ్ స్టార్స్



**రాజధాని వార్తలు, రాయపూడి :** కలెక్టివ్ గుడ్ ఫౌండేషన్ వారు డేటాల్ బనేగా స్వచ్ఛ ఇండియా కార్యక్రమంలో భాగంగా విజయవాడలో 2017-18 సంవత్సరానికిగాను స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ ప్రోగ్రామిక్‌లో ఫైవ్ స్టార్స్ గెలుపొందిన ఎమ్.పీ.పీ.ఎస్ (మెయిన్) రాయపూడి స్కూలుకు మన విద్యాశాఖమంత్రి ఘంటా.శ్రీనివాసరావు గారి చేతుల మీదుగా మెమెంటోని అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దడిగి.సుబ్బారావు ఉపాధ్యాయులు తాడిబోయిన నాగజ్యోతి తల్లిదండ్రులు బావిరెడ్డి, నాగపావని పావనిప్రసన్న కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరించారు.

## మహాచైత్యం సందర్శించిన శ్రీలంక బౌద్ధులు

**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రసిద్ధ బౌద్ధారామంగా పేరుగాంచిన వారసత్వ అమరావతిని శుక్రవారం శ్రీలంక కు చెందిన 80 మంది బౌద్ధులు సందర్శించారు. కొలంబోకు చెందిన గ్రీన్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఈ బృందం రెండు రోజుల క్రితం శ్రీలంక నుంచి బయలుదేరి అమరావతి చేరుకున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ తమిళనాడు, తెలంగాణా రాష్టాలలోని బౌద్ధ క్షేత్రాలను సందర్శించేందుకు పిబ్రవరి 28 వరకు పర్యటించనున్నారు. ముందుగా అమరావతిలోని ద్యానబుద్ధ ప్రోజెక్టును సందర్శించారు. బౌద్ధ లామాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# వైకల్యానికి ఓటమి

**పక్కన ఒక తోడు లేనిదే అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. కళ్లు కనిపించకపోయినా.. చీకట్లను గెలవాలన్న తపనే వారిని ముందుకు నడిపించింది. భారత సైనికులతో కలిసి కవాతు చేయాలన్న వీరి కోరిక నెరవేరింది. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు అంధ విద్యార్థులు. గణతంత్ర వేడుకలలో మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొని అబ్బుర పరచి, గవర్నర్ నుంచి బహుమతి అందుకున్నారు.**

**వైకల్యం దేనికీ అడ్డుకాదని నిరూపించింది బెనో జెఫిన్. పుట్టుకతో 100 శాతం అంధురాలిగా పుట్టినా కలలను సాకారం చేసుకోవడంలో ఆమె వెనుకబడలేదు. మొదటి అంధ ఐఎఫ్ఎస్‌గా ఎంపికైన ఆమె దివ్యాంగులకు స్ఫూర్తిని రగిలిస్తున్నారు.**







తెలంగాణ గణతంత్ర వేడుకల్లో ఈ అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన అంధ విద్యార్థులు తమ వైకల్యాన్ని పక్కన పెట్టి సైనికులతో కలిసి అడుగేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సైనికులతో పాటు పరేడ్‌లో పాల్గొని అందరిని అబ్బుర పరిచారు. విద్యార్థులంతా.. చినజియర్ స్వామి ఆధ్వర్యంలో నడిచే జీవ నేత్రాలయ విద్యాసంస్థకి చెందిన వారు.. దాదాపు 200 మంది విద్యార్థులకు శంషాబాద్‌లోని ఈ విద్యాసంస్థ ఉచిత విద్య, హాస్టల్ వసతి కల్పిస్తోంది. ఆ సంస్థలోని 50 మంది విద్యార్థులు.. పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొని అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ బృందానికి అంజమ్మ నేతృత్వం వహించింది.

గతేడాది ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో శంషాబాద్ లోని ఓ కాలనీలో 35 మంది స్టూడెంట్స్ పరేడ్ చేశారు. ఇది చూసిన కాలనీ వాసులు ఈ విద్యార్థులను అభినందించి.. వారి ప్రయత్నాన్ని ఇంతటితో ఆపవద్దని ప్రోత్సహించారు. విద్యార్థులు పరేడ్ చేసిన దృష్యాలను అధికారులకు పంపారు. అంధ విద్యార్థుల ప్రతిభను, పట్టుదలను చూసిన పీఎంవో అధికారులు... జీవనేత్రాలయ విద్యాసంస్థని అభినందించారు. అక్కడ వీరి పరేడ్ చూసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. అంధ విద్యార్థులకు.. గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొనే అవకాశం ఇచ్చింది. పట్టుదలతో కృషి చేస్తే ఎంతటి కష్టమైనా పనైనా అవలీలగా చేసేయొచ్చు అని నిరూపించారు ఈ విద్యార్థులు. ఈ విద్యార్థులకు సెల్యూట్ చేద్దాం..

## ఆమె

తమిళనాడుకు చెందిన బెనో జోసెఫ్ 1990 పుట్టిన ఆమె తన 25 ఏటనే మొదటి ప్రయత్నంలోనే ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికై చరిత్ర సృష్టించింది. 2013లో ఆమె ఈ పరీక్షకు హాజరై 343వ ర్యాంకు పొందింది. ప్రస్తుతం విద్యాలయాల్లో విద్యార్థులకు మరీ ముఖ్యంగా దివ్యాంగులకు స్ఫూర్తిని కలిగించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. ఏదో లోపంతో ఉన్నట్లు ఎప్పుడూ భావించవద్దని వనరులను, శక్తిసామర్థ్యాలను వినియోగించడంలో ముందుండాలని ఆమె వివరిస్తున్నారు. లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్‌లో చదివిన ఆమె ఆపై మధురై వర్సిటీలో ఇంగ్లీష్ లిటరేచర్ చేశారు. అంతేకాదు ఐఎఫ్ఎస్‌గా ఎన్నికవ్వడానికి ముందు ఆమె స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ప్రొబెషనరీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. మొదటి నుంచి సామాజిక అంశాల్లో చురుకుగా ఉండే వారు. వనరులను జాగ్రత్తగా వాడుకోవాలని చెబుతుండేవారు. ఆమె ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులవడానికి చాలా మంది సహాయం చేశారని,వారిలో ఆమె తల్లి పేపర్లతోపాటు, అనేక పాఠ్యాంశాలను గంటల తరబడి చదివి వినిపించేందని ఆమె వెల్లడించారు.. అంధులకు సహాయపడే (జాబ్ యాక్సెస్‌విత్ స్పీచ్ జేఏడబ్ల్యూఎస్) సాఫ్ట్‌వేర్‌ను ఆమె ఉపయోగించుకున్నారు. దీంతో కంప్యూటర్ స్క్రీన్‌పై ఆమె సులభంగా చదువుకునే వెలుసుబాటు కలిగింది. అంధురాలిగా ఆమె ఎప్పుడూ కుంచించుకు పోలేదు. సాధారణ అభ్యర్థులతోపాటు, అంధులకు కూడా అవకాశం కల్పించిన ప్రధాని మోడీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వాస్తవానికి ఇంతకు ముందు 20:20 దృష్టి లోపం ఉన్న వారికి కళ్లజోడు ధరించిన వారికి మాత్రమే యూపీఎస్‌సీ విజేతలకు అవకాశం ఉండేది. ఇలాంటి వారు ఇన్‌కమ్ ట్యాక్స్, రెవెన్యూ సర్వీసుల్లో ఉన్నారని మాజీ రాయబారి టీపీ శ్రీనివాసన్ తెలిపారు. ఆమె తండ్రి లూక్ ఆంథోని చార్లెస్ రైల్వే ఉద్యోగి కాగ,తల్లి మేరీ పద్మ గృహిణి. బెనోజెఫిన్‌కు అభినందనలు తెలుపుదాం...

## కాలమ్

### ధ్యానంతో

మన శరీరంలోకి వెళ్ళిన ఆహారం 24గంటల్లో...మలినంగా బయటికి వెళ్ళిపోవాలి. లేకపోతే జబ్బులు !

మనశరీరంలోకి వెళ్ళిన నీరు నాలుగు గంటల్లో బయటికి వెళ్ళిపోవాలి. లేకపోతే...జబ్బులు !

మన శరీరంలోకి వెళ్ళిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్ళిపోవాలి...లేకపోతే...మనం రోగగ్రస్థులం ఔతాం..!

మరి మనలోకి చేరిన కోపం... పగ... అసూయ.. .ద్వేషం.... మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలు తరబడీ మనలోనే ఉంటే...ఏమౌతుందో...తెలుసా...మనం నిత్య రోగగ్రస్తులం అవుతాం.

మనంరోజూ జీవిస్తున్నాం అని మనం అనుకుంటున్నాం...నిజానికి రోజూ కొద్ది కొద్దిగా మరణిస్తున్నాం ! మనకు వయసు పెరిగితే...ఆయుష్షు తగ్గినట్టా, పెరిగినట్టా..?

మనం ప్రతిరోజూ...నెగెటివ్ ఎనర్జీలతో కొద్ది కొద్దిగా మరణిస్తున్నామన్న...చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి.

మనలోచేరి బయటికి వెళ్ళిపోకుండా తిష్ట వేసుకొని....మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని...ఒత్తిడిని... ద్వేషాన్ని...బద్ధకాన్ని... అనారోగ్యాన్ని...దూరం చెయ్యాలి !"

అందుకు మన శరీరంలోకి అధిక మొత్తంలో ప్రాణశక్తినిచేర్చే ఉత్తమ మార్గం యోగా...

నెగిటివ్ ఆలోచనల స్థానంలో పాజిటివ్ ఆలోచనలు...క్రమ క్రమంగా ఆలోచనల ఉధృతి తగ్గించుకోవటానికి సత్సంగం, యోగా ఉత్తమ మార్గంగా దార్శనికుల బోధ శిరోధార్యం చేసుకోవాలి.

భారతీయ ఋషులు యోగ మార్గాన్ని అనుసరించారు...

రోజూ అర గంటైనా... యోగ, ధ్యానం, మరేయితర సాధనైనాచేసి రోజూ జీవించటం అలవర్చుకున్నవారు ఉన్నతులు, ఆస్థిపరులు, ఎందుకైనా యోగ్యులు !

## పవర్ లిఫ్టింగ్ నేషనల్ ఫెడరేషన్ కప్ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

**మంగళగిరి :** కోల్‌కత్తాలో ఈనెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరుగనున్న పవర్ లిఫ్టింగ్ నేషనల్ ఫెడరేషన్ కప్ పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వర రావు తెలిపారు. పవర్ లిఫ్టింగ్ నేషనల్ ఫెడరేషన్ కప్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు మహిళా లిఫ్టర్లు సెలెక్ట్ అయితే వారంతా మంగళగిరికి చెందినవారేనని తెలిపారు. డి.52 కేజీల విభాగంలో షేక్ సాదియా అలమాస్, 72 కేజీల విభాగంలో మట్టుకొయ్య సలోమి, 84 కేజీల విభాగంలో బొల్లినేని చంద్రికలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. సాదియా అలమాస్, మట్టుకొయ్య సలోమిలకు షేక్ సంధానీ శిక్షణ ఇవ్వగా బొల్లినేని చంద్రిక కు కే.ఎన్.వీ.నరేంద్ర శిక్షణ ఇచ్చినట్లు గుమ్మడి పుల్లేశ్వరరావు తెలిపారు.ఎన్. నాగరాజు, స్వయంశక్తి రిపోర్టర్.


## గోవుల సంక్షేమానికే ప్రాధాన్యం



**న్యూఢిల్లీ :** మధ్యంతర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం కార్మికుల కంటే గోవుల సంక్షేమానికే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. గోవుల కోసం రూ.750కోట్లను ప్రకటించి, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు అందించే పింఛనుకు కేవలం రూ.500 కోట్లను మాత్రమే కేటాయించింది. గోవుల సంరక్షణ కోసం 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్'ను ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. గోమాతను రక్షించుకోవడంలో ప్రభుత్వం వెనకాడబోదని తెలిపారు.ఈ నిధిని దేశీయ ఆవుల సంతతిని పెంపొందించడానికి ఉపయోగిస్తామని చెప్పారు. కానీ దేశవ్యాప్తంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అసంఘటిత కార్మికుల పట్ల కేంద్రం చిన్నచూపు చూసింది.'ప్రధానమంత్రి శ్రమయోగి బంధన్' పేరిట ప్రకటించిన ఈ పథకం అసంఘటిత రంగంలో పని చేస్తున్న 10 కోట్ల మందికి వర్తింపజేస్తామని కేంద్రం ప్రకటించింది.ఈ పథకంలో చేరేవారు(29 ఏండ్ల లోపు) నెలకు రూ.100లు ప్రీమియం చెల్లించాలి. 60ఏండ్లు నిండిన తర్వాత వారికి రూ.3వేలు చెల్లించనున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ తాజాగా ప్రకటించిన ఈ కొత్త పథకంలోనూ కార్మికలోకానికి ప్రాధాన్యత దక్కలేదు.

## నంద్యాల టికెట్ ఇవ్వండి

### 6న టీడీపీ కార్యాలయం ప్రారంభిస్తా : ఏవీ సుబ్బారెడ్డి



**రాజధాని వార్తలు, నంద్యాల, కర్నూల్ :** రానున్న ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ స్థానానికి టీడీపీ టికెట్ ఆశిస్తున్నట్లు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. ఎన్నికల నోటిఫికేషన్ మరో నెల రోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉండడంతో సుబ్బారెడ్డి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం నంద్యాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6వ తేదీ టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. పార్టీ సంక్షేమ పథకాలు, ఇటీవల సీఎం ప్రకటించిన వరాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడంలో భాగంగానే పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కార్యాలయం ప్రారంభించడాన్ని పోటీ సంకేతంగా భావించరాదని అన్నారు. నంద్యాల అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్నానని, అధిష్టానం టికెట్ ఎవ్వరికి ఇచ్చినా వారి గెలుపునకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అధిష్టానం ఆదేశిస్తే నంద్యాల లేదా ఆళ్ళగడ్డ అసెంబ్లీ స్థానాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే టీడీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడంతో భాగంగానే పార్టీ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పద్మావతినగర్ ఆర్చీ ఎదురుగా జయంతా వెజ్‌వరల్డ్ స్థలంలో పార్టీ కార్యాలయం ఏర్పాట్లను పరిశీలించారు. విలేఖరుల సమావేశంలో సిటీ కేబుల్ మేనేజర్ జయచంద్రారెడ్డి, గండా వెంకటసుబ్బారెడ్డి, ఆర్‌వీ సుబ్బారెడ్డి, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





**కళ్ళం ఇంజనీరింగ్ కాలేజ్ మనందరికి సుపరిచితమే. ఐతే ఇటీవలే ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ కొన్ని కాలేజెస్ విసిట్ చేశారు. ఆ ప్రక్రియ లో భాగంగా శ్రీ చంద్రశేఖర్ గారు కాలేజ్ ని సందర్శించారు. చక్కటి ప్రకృతి లో వుండే కాలేజీ ని చూసి ఆయన ఎక్కువ సమయం గడిపారు. కళ్ళం మనేజ్మెంట్ వారు వొచ్చిన అతిధి ద్వారా ఒక మొక్కని నాటించి మంచి కార్యక్రమ నికి నాంది పలికారు.**

**కిరణ్ కుమార్ గుంటూరు**

## ఘనంగా సిలికానాంధ్ర వర్సిటీ ప్రథమ స్నాతకోత్సవం

**మిల్పిటస్ (కాలిఫోర్నియా):** అమెరికాలోని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ ప్రథమ స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కాలిఫోర్నియా రాష్ట్రంలో రెండు సంవత్సరాల క్రితం స్వతంత్ర ప్రతిపత్తితో ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయం భారతీయ కళలు, భాషలు వంటి వాటిలో మాస్టర్స్, డిప్లొమా సర్టిఫికెట్ స్థాయి కోర్సులను అందిస్తోంది. ఆయా కోర్సులను పూర్తి చేసిన మొదటి బ్యాచ్‌కి చెందిన 31 మంది విద్యార్థులు.. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ అధ్యక్షుడు ఆనంద్ కూచిభొట్ల, పాలకవర్గ ఛైర్మన్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి చేతుల మీదుగా పట్టాలు అందుకున్నారు. కాంప్‌బెల్ హెరిటేజ్ థియేటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో శోభాయాత్ర కూడా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రొవొస్ట్ రాజు చమర్తి ముందు నడవగా ఆనంద్ కూచిభొట్ల, హనిమిరెడ్డి, డా.పప్పు వేణుగోపాల రావు, నీరజ్ భాటియా, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ దీనబాబు కొండుభట్ల, చీఫ్ కాంప్లయన్స్ ఆఫీసర్ దిలీప్ కొండిపర్తి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రసాద్ కైపాతో పాటు విద్యార్థులు.. స్నాతకోత్సవ దుస్తులతో కవాతుగా వేదిక వద్దకు చేరుకున్నారు. విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటివరకు సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. విశ్వవిద్యాలయ త్రైమాసిక పత్రిక 'శాస్త్ర' ను అధ్యక్షుడు ఆనంద్, పాలక మండలి సభ్యుడు డా.పప్పు వేణుగోపాలరావు ఆవిష్కరించారు. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ




కర్ణాటక సంగీత ఆచార్యులు డా.శ్రీరాం పరశురాం నిర్వహించిన హిందుస్థాని–కర్ణాటక సంగీత జుగల్‌బంది కచేరీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి భారత్ నుంచి విచ్చేసిన అధ్యాపక బృందం డా.శ్రీరాం పరశురాం, డా.మాలా స్వామి, డా.రమాదేవి, డా.సుమిత్ర వేలూరి, డా.యశోద ఠాకూర్, డా.అనుపమ కైలాష్, తదితరులను విశ్వవిద్యాలయ పాలకవర్గం ప్రత్యేకంగా సన్మానించింది.

**- ఖాన్**

## 9,10 తేదీల్లో కొండవీడు పండుగ

**రాజధాని వార్తలు, గుంటూరు :** ప్రఖ్యాత కొండవీడు కోట పండుగ వేడుకలు వచ్చే నెల 9,10 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామని పౌర సరఫరాల శాఖా మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొనారు. రాత్రి జడ్పీ సమావేశ మందిరంలో జగిరిన అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడూతూ ఆ రెండు రోజులు పలు సాంస్కృతిక, హాస్య, వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే కొండపైకి 5.1 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ.87 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వేడు కల కోసం సీఎం మరో రూ.3 కోట్లు కేటాయించారని వెల్లడించారు. ఉత్సవాలను సీఎం ప్రారంభిస్తారన్నారు. ఇక నుంచి ఈ వేడుకలు ప్రతి ఏటా నిర్వహిస్తామన్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా చేయాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరుతందని పేర్కొనారు. ఆర్కియాలజీ రాష్ట్ర కమిషనర్ డాక్టర్ వాణీ మోహన్ మాట్లాడూతూ కొండపల్లి కోటను కూడా పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దామన్నారు. పవర్ పాయింట్ వివరించారు. కలెక్టర్ కోన శశిధర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలలన్నారు. కొండవీడు కోట అభివృద్ధికి నోడల్ అధికారిగా జేసీ ఇంతియాజ్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ, అమరావతి సీఈవో డాక్టర్ శివానాగిరెడ్డి కొండవీడు చరిత్రను వివరించారు. సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ, జేసీ ఇంతియాజ్ జెడ్పీ చైర్‌పర్సన్ షేక్ జానీ మూన్ పాల్గొన్నారు.

## ప్రాంతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

**రాజధాని వార్తలు, విజయవాడ :** ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తుల మీద, దళితులు, ముస్లింలు, ఆదివాసీలు, క్రిస్టియన్లు, మహిళలపైనా సంఘ్ పరివార్ దాడులు పెరిగిపోయాయని కులనిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్ అన్నారు. హిందుత్వ ఫాసిస్టు దాడికి వ్యతిరేకంగా విశాలమైన ఉద్యమాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో ఈనెల 5వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రాంతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాలమైన ఐక్య సంఘటన ద్వారానే ఫాసిజాన్ని తిప్పికొట్టగలమని, ప్రజాస్వామిక శక్తులు, కుల నిర్మూలన శక్తులు, మహిళా సంఘాలు అన్నీ కలిసి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సును ప్రొఫెసర్ జి. హరగోపాల్, జహీర్ అలీఖాన్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. రవిచంద్ర, పీడీఎం రాజధాని కార్యదర్శి ఎం. క్రాంతికుమార్, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.పోలారి, పీవోడబ్ల్యు నగర అధ్యక్షురాలు కె. దుర్గా, సీఎల్‌సీ నాయకులు ఎన్. శ్రీమన్నారాయణ, టి. ఆంజనేయులు, పీడీఎస్‌యూ నేత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# మూగబోయిన సోషలిస్టు కంఠం

**మానవహక్కుల కార్యకర్త,సామ్యవాది,సమసమాజ స్థాపకుడు,కార్మికసంఘాల నేత, విలువలున్న రాజకీయవేత్త, నిరాడంబరుడు, అన్నింటికీ మించి ఎమర్జెన్సీ హీరో, దేశంలోనికుల,మత ప్రాంతాలకు అతీతంగా దేశరాజకీయాలను ప్రభావితం చేసిన రెబల్ పార్లమెంటేరియన్ జార్జిఫెర్నాండేజ్ జనవరి 29న పరమపదించారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది.**



జార్జి ఫెర్నాండేజ్ భౌతిక ఖాయం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ



గోవా మూలాలున్న క్రిస్టియన్ కేథలిక్ కుటుంబానికి చెందిన జార్జి ఫెర్నాండేజ్ 1930 జూన్ 3న జోసఫ్ ఫెర్నాండేజ్,అలీస్ మార్తా ఫెర్నాండేజ్ లకు మొదటి సంతానంగా జన్మించారు. ఆయనకు ఐదుగురు తమ్ముళ్లు. జోసఫ్ పీర్‌లెస్‌కంపెనీ దక్షిణ విభాగానికి అధికారిగా పనిచేశారు.జార్జి ఫెర్నాండేజ్‌ను మతబోధకుడుగా మారాలని ఆయన తండ్రి సెమినార్‌కు పంపారు. అయితే రెండున్నరేళ్లలో ఎస్ఎస్ఎల్సీ అయిన తర్వాత ఆయన అక్కడి నుంచి పారిపోయారు. రోడ్లపక్కనే సాగిన అతని జీవితం అనేక మలుపులు తిరిగింది.

సెమినరీ నుంచి ఆయన ముంబై వెళ్లిపోయారు. వీధుల్లో పడుకున్నారు. ఉడిపి హొటళ్లలో తిన్నారు. చౌపతీ బీచ్‌ల్లో పడుకొని ఉండగా, అనేక సార్లు రాత్రిపూట పోలీసులు అక్కడి నుంచి తరిమివేసేవారు. ప్రసిద్ధ యూనియన్ నాయకుడు డి మెల్లో, సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహియాలు పరిచయం ఆయన జీవితాన్ని మలుపుతిప్పింది. 1950ల్లో చిన్నహొటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే వారి హక్కుల కోసం పోరాడారు. అందుకోసం ఆయా కంపెనీల గూండాల దాడికి ఆయన అనేకసార్లు గురయ్యారు.1961నుంచి 68 వరకు ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సభ్యుడిగా పనిచేశారు. 1967లో సార్వత్రిక ఎన్నికల్లో సంయుక్త సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసి ముంబైలో అప్పటి బడా పారిశ్రామిక వేత్త, కాంగ్రెస్ నాయకుడు పాటిల్‌ను ఓడించి కార్మికనేతగా పార్లమెంట్‌లో అడుగుపెట్టి దేశంలో తిరుగులేని యువనాయకుడిగా అవతరించారు. 1974లో ఆయన దేశవ్యాప్తంగా రైల్వే సమ్మె చేయించినపుడు, జార్జి ఫెర్నాండెజ్ పేరు రెండోసారి దేశమంతా హెడ్‌లైన్స్‌లో నిలిచింది.అప్పటికి రెండు దశాబ్దాల నుంచి చేస్తున్న డిమాండ్ల సాధనకు గాను మే 8వ తేదీ నుంచి 27వ తేదీ వరకు దేశవ్యాప్తంగా రైల్వే కార్మికులంతా ఈ సమ్మెలో పాల్గొన్నారు.

స్వతంత్రం వచ్చిన తర్వాత మూడు పే కమిషన్స్ వచ్చాయి. కానీ, రైల్వే ఉద్యోగుల వేతనాల్లో మాత్రం ఎలాంటి మార్పూ రాలేదు. దీంతో ఆలిండియా రైల్వే మెన్ ఫెడరేషన్ అధ్యక్షుడు అయిన జార్జి.. వేతనాలు పెంచాలనే డిమాండుతో దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు.జార్జి ఫెర్నాండెజ్ కోరికతో టాక్సీ డ్రైవర్స్, ఎలక్ట్రిసిటీ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్లు కూడా ఆ సమ్మెలో కలిశాయి.రైల్వే సమ్మెతో ఒక్కసారిగా దేశం మొత్తం స్తంభించింది. సమ్మెను విఫలం చేయడానికి ఇందిరాగాంధీ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. చాలా చోట్ల రైల్వే ట్రాక్స్ ఖాళీ చేయించేందుకు సైన్యం కూడా ప్రయోగించింది.ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ రిపోర్ట్ ప్రకారం ఈ సమ్మెను విఫలం చేయడానికి 30 వేల మందికి పైగా కార్మిక నేతలను జైళ్లలో వేశారు. ప్రభుత్వం ఈ సమ్మెను చాలా క్రూరంగా అణిచివేసే ప్రయత్నం చేసింది. రైల్వే సమ్మె జరుగుతున్నప్పుడే ఇందిరాగాంధీ పోఖ్రాన్ అణు పరీక్ష చేశారు. దాంతో మొత్తం ప్రపంచం షాక్ అయ్యింది. కానీ, దేశ ప్రజలపై అది ఏమాత్రం ప్రభావం చూపించలేదు. ఆ సమయంలో రైల్వే సమ్మె మాత్రమే ప్రధాన వార్తగా నిలిచింది. తదనంతర కాలంలో ముజఫర్ నగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఫెర్నాండెజ్ 1989 డిసెంబర్ 5వ తేదీ నుంచి 1990 నవంబర్ 10వ తేదీ వరకు రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు.కార్గిల్ యుద్ధం సమయంలో రక్షణ మంత్రి పధానమంత్రి వాజ్‌పేయీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) ప్రభుత్వంలో ఫెర్నాండెజ్ పనిచేశారు.రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో భారతదేశం 1998 మే నెలలో రెండో దఫా అణు బాంబు పరీక్షలు జరిపినప్పుడు, భారత్-పాకిస్తాన్ మధ్య 1999 మేలో కార్గిల్ యుద్ధం జరిగినప్పుడు జార్జి ఫెర్నాండెజ్ దేశ రక్షణ మంత్రిగా ఉన్నారు.

1975 జూన్ 25న అత్యవసర స్థితి ప్రకటించినపుడు జార్జి ఫెర్నాండెజ్ ఉదయం అయిదున్నరకే లేచి ఆయన భువనేశ్వర్ విమానం ఎక్కారు. అక్కడకు వెళ్లాక ఆయనకు దేశంలో ఎమర్జెన్సీ విధించారని తెలిసింది. అప్పుడే జార్జి 'నేను నా దేశంలోనే శరణార్థిని అయిపోయాను' అన్నారు. 1976 జూన్ 10న జార్జిఫెర్నాండేజ్ పోలీసులకు దొరికిపోయారు.

**జార్జిని కోల్‌కతాలోని ఒక చర్చి నుంచి అరెస్ట్ చేయగానే అదే రాత్రి రహస్యంగా రష్యా సైనిక వాహనంలో ఆయన్ను ఢిల్లీ తీసుకెళ్లారు.ఆయనను కచ్చితంగా ఎన్‌కౌంటర్ చేస్తారనిపించింది. ఇందిరాగాంధీ అప్పుడు మాస్కో పర్యటనలో ఉన్నారు. ఫోన్లో ఆమె ఆదేశాలు రావడం కాస్త లేటైంది. ఆ లోపు చర్చి ఫాదర్ విజయన్, జార్జిని పట్టుకున్నారని కోల్‌కతాలో ఉన్న బ్రిటిష్, జర్మన్ సబ్-ఎంబసీలకు చెప్పారు. ఈ వార్త వెంటనే లండన్, బెర్లిన్ చేసింది.సోషలిస్ట్ ఇంటర్నేషనల్ నేతలైన బ్రిటిష్ ప్రధాని జేమ్స్ కాలఘాన్, జర్మన్ చాన్స్‌లర్ విలీ బ్రాండ్, ఆస్ట్రియా చాన్స్‌లర్ బ్రూనో క్రాయెస్కీ ముగ్గురూ మాస్కోలోని ఇందిరాగాంధీకి ఫోన్ చేశారు.**

**సెమినరీ నుంచి ఆయన ముంబై వెళ్లిపోయారు. వీధుల్లో పడుకున్నారు. ఉడిపి హొటళ్లలో తిన్నారు. చౌపతీ బీచ్‌ల్లో పడుకొని ఉండగా, అనేక సార్లు రాత్రిపూట పోలీసులు అక్కడి నుంచి తరిమివేసేవారు. ప్రసిద్ధ యూనియన్ నాయకుడు డి మెల్లో, సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహియాలు పరిచయం ఆయన జీవితాన్ని మలుపుతిప్పింది. 1950ల్లో చిన్నహొటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే వారి హక్కుల కోసం పోరాడారు. అందుకోసం ఆయా కంపెనీల గూండాల దాడికి ఆయన అనేకసార్లు గురయ్యారు.1961నుంచి 68 వరకు ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సభ్యుడిగా పనిచేశారు. 1967లో సార్వత్రిక ఎన్నికల్లో సంయుక్త సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసి ముంబైలో అప్పటి బడా పారిశ్రామిక వేత్త, కాంగ్రెస్ నాయకుడు పాటిల్‌ను ఓడించి కార్మికనేతగా పార్లమెంట్‌లో అడుగుపెట్టి దేశంలో తిరుగులేని యువనాయకుడిగా అవతరించారు.**

**జార్జి హత్య జరిగితే తర్వాత ఏర్పడే పరిణామాల గురించి హెచ్చరించారు. దానివల్ల భారత్‌తో తమ సంబంధాల్లో క్షీణించవచ్చన్నారు".ఇందిరాగాంధీ అంతర్జాతీయ స్పందనలకు భయపడేవారు. అందుకే, ఆమె జార్జిని ఎన్‌కౌంటర్ చేయకుండా తీహార్ జైలుకు పంపించారు.**

ఎమర్జెన్సీ తర్వాత 1977లో ఎన్నికల ప్రకటన రాగానే జైల్లో ఉన్న జార్జి ఫెర్నాండెజ్ ముజఫర్‌పూర్ నుంచి పోటీ చేశారు. ఖైదీల ఆరోగ్యాన్ని పర్యవేక్షించే డాక్టరుకు ఫలితాల వెల్లడి రోజున విజయం ఎవరిని వరించిందో కనుక్కోవాల్సిందిగా కోరారు. ఆయన ఆ రోజు సాయంత్రం జార్జి లక్ష ఓట్ల లీడ్‌తో ఉన్నారన్న వార్త తీసుకువచ్చారు. దీంతో అక్కడ పండుగ వాతావరణం ఏర్పడింది.జై ఆంధ్ర ఉద్యమంలో జెజవాడ, గుంటూరు, మచిలీపట్నంలలో జరిగిన సభల్లో ఆయన ఉపన్యాసం ఉద్రూతలూగించింది. జనతా హయాంలో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉండి కోకోకోలాను దేశం నుంచి వెళ్లిపోయేలా చేయడం సంచలనాత్మకమైంది. కోకోకోలా ఫార్ములాను ఇవ్వనందును ఆ బహుళదేశ సంస్థను పరిశ్రమల మంత్రిగా ఉండికూడా బయటకు వెళ్లగొట్టిన ఘనతి ఆయనది. ప్రస్తుతం విదేశీ సంస్థలు ఏం పెడుతున్నాయి ? అనే కనీస జ్ఞానం లేకుండా మనకు ఎంత కమీషను ఇస్తారన్న ధోరణిలో సాగుతున్న నేటి రాజకీయ నేతలు ఆయన నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది.

తర్వాత జనతాదళ్ హయంలో రైల్వే మంత్రిగా పనిచేశారు. నేడు దేశ రైల్వే రంగంలో కలికితు రాయిగా చెప్పకునే కొంకణ్ రైల్వే వెనుక ఆయన రైల్వే మంత్రిగా ఉన్నపుడు చేసిన కృషి కీలకమైంది.తర్వాత ఆయన రాజకీయ జీవితం మలుపు తీసుకుంది. జనతాదళ్ ఆయన సమతా పార్టీని స్థాపించారు.నాడు వాజ్ పేయి సారధ్యంలో ఉన్న బీజేపీతో చేతులు కలిపారు. అది అప్పట్లో ఒక పెను సంచలనం.పొగడ్తలు, విమర్శలు ఎన్నున్నా ఖాదీ వస్త్రధారణలోని సోషలిస్టు నేతగా కుల మత ప్రాంతాలకు అతీతంగా దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన పార్లమెంటరీ రెబల్ నేతగా అయితే ఆయన గుర్తింపు పొందారు.బీహార్ ఆయన రాజకీయ కేంద్రంగా మారడంతో చాలామంది ఆయన ఉత్తరాదికి చెందిన రాజకీయ నాయకుడేమో అనుకునే వారు.

భారత పారిశ్రామిక ప్రగతికి విశ్వరూపమైన ముంబయి మహానగరంలో టాక్సీ డ్రైవర్లు, బస్ డ్రైవర్లనుంచి హొటల్ వర్కర్స్, సెక్స్ వర్కర్స్ దాకా అందరికీ నాయకత్వం వహించి బంద్‌లను, ఆందోళనలను ఆయుధంగా మల్చుకున్న ఫైర్ బ్రాండ్ లీడర్ జార్జి. ఎమర్జెన్సీ సమయంలో ఆయన సిక్కు వేశంలో తిరిగేవారు. పోలీసులు ఎంతకీ ఆయనను అరెస్టు చేయకపోవడంతో ఇందిరాగాంధీ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతని తమ్ముడు లారెన్స్ ఫెర్నాండేజ్‌ను కర్ణాటక ప్రభుత్వం అరెస్టు చేసి, జార్జి ఆచూకీ కోసం వేధించింది. లారెన్స్ బెంగళూరు కార్మిక సంఘాలకు నాయకత్వం వహించేవారు. ఆపై అతని చిన్నతమ్ముడు లారెన్స్ కూడా అరెస్టు చేసి తీవ్రంగా హింసించారు.ఆయన స్నేహితురాలు, సమతాపార్టీ నాయకురాలు స్నేహలతారెడ్డిని అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టడమే కాకుండా ఆస్మాకు వైద్యం అందించకుండా ఆమె ఆరోగ్యాన్ని ధ్వంసం చేశారు.


**దేశంలో నెలకొల్పే ఉత్పత్తి రంగాలన్నీ ప్రజల, ప్రభుత్వ భాగస్వామ్యంతో నెలకొల్పబడి, దాని ఫలాలు, వక్తులకు, వర్గాలకు కాకుండా దేశప్రజలందరికీ సమానంగా దక్కాలన్న సిద్ధాంతమే సోషలిజం లేదా సామ్యవాదం.**

ఎటువంటి నేరారోపణ లేకుండా జైలుపాలైన కాశ్మీర్, పంజాబ్ నాగా, టిబెటన్, బర్మా జాతీయులను, రాజకీయంగా వేధింపబడి జైలుపాలు అయిన వారిని విడిపించడంలో ఆయన పాత్ర మరువలేనిది. మంత్రిగా బంగ్లాలో నివశిస్తూ కేవలం రెండు గదులను మాత్రమే ఆయన వాడుకునేవారు. మిగతా గదులన్నీ పార్టీ కార్యకర్తలు, మానవహక్కుల కార్యకర్తలతో నిండిపోయేది. వారందరికీ అక్కడే భోజనసదుపాయాలు ఉండేవి. మరో విశేషం ఏమిటంటే రక్షణ మంత్రిగా ఉండి ఆయన తన ఇంటిముందున్న చెక్‌పోస్టును తీసిపారేసి ప్రజా నాయకుడిగా నిత్యం ఆయన ప్రజలకు అందుబాటులో ఉండేవారు. కేంద్ర మాజీ మంత్రి హుమాయున్ కబీర్ కుమార్తె లైలాను ఆయన వివాహం చేసుకున్నారు. బంగ్లాదేశ్‌తో జరిగే యుద్ధంలో రెడ్‌క్రాస్ అసిస్టెంట్ డైరక్టర్‌గా ఆమె పనిచేస్తుండగా ఫెర్నాండేజ్‌కు విమానంలో పరిచయమయ్యారు.1971 జూలై 22న వారి వివాహం జరిగింది. 1974 జనవరిలో వారికి సీయోన్ ఫెర్నాండేజ్ జన్మించారు. అదే సమయంలో రైల్వే సమ్మె ఉద్రిక్తంగా సాగి, ఆయన అరెస్టుకు దారి తీసింది. కుమారుడంటే ఆయనకు ఎనలేని ప్రేమ. అయితే 80ల్లో వారి వివాహబంధం బీటలు వారి విడాకులు తీసుకున్నారు. 1984 నుంచి ఆయన జయా జైట్లీతో సహ జీవనం చేశారు. వాస్తవానికి జయాజైట్లీ భర్త ఆయనకు సలహాదారుగా పనిచేసేవారు. 1990లో సీయోన్ చిగాగోలో జరిగిన కుమారుడి ఎంబీఏ స్నాతకోత్సవానికి ఆయన హాజరయ్యారు. 2002లో ఆయన కుమారుడి వివాహం జరిగింది. 2010 నుంచి అల్జీమర్స్ ఆయనను తీవ్రంగా బాధించింది. ఆసమయంలో భార్య లైలా మళ్లీ తిరిగి వచ్చారు. కుమారుడు సీయోన్ ప్రస్తుతం న్యూయార్క్ బ్యాంకులో పనిచేస్తున్నారు.జనతాదళ్ పార్టీలో కీలక నాయకుడైన ఫెర్నాండెజ్ 1994లో ఆ పార్టీని వీడి సమతా పార్టీని స్థాపించారు. 1967 నుంచి 2004వ సంవత్సరం వరకూ తొమ్మిది సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిసారీ ఆయనపై నిందలు మోపి అనేక విధాలుగా వేధించినప్పటికీ అవినీతికి కేసులో ఒక్కసారి కూడా పట్టుబడని ఆయన సీక్రెట్ కెమేరాలతో ఆపరేషన్ వెస్ట్ ఎండ్ పేరుతో తెహల్కా నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో మాథ్యూ సామ్యుయేల్ ఆయుధాల డీలర్‌గా జయాజైట్లీ బేరసారాలు సాగిస్తూ పట్టుబడటంతో ఫెర్నాండేజ్ రక్షణ మంత్రిత్వశాఖకు రాజీనామా చేశారు. అయినప్పటికీ ఆయనపై అవినీతి కేసులు మాత్రం నిరూపింపబడలేదు. అయితే ఫైర్ బ్రాండ్‌గా ఉన్న ఆయన రాజకీయాల నుంచి తెరవెనుకకు వెళ్లాల్సి వచ్చింది.

కొంకిణి, కన్నడ, ఇంగ్లీష్, హిందీ, తుళు ,మరాఠీ,తమిళం, ఉర్దూ మలయాళం, లాటిన్ భాషల్లో ఆయన మాట్లాడగలరు. తుళు ఆయన మాతృభాష కాగ,మరాఠీ,ఉర్దూ ఆయన జైల్లో నేర్చుకున్నారు. రాజనీతిజ్ఞుడు, నిరాడంబరి, బహుభాషాకోవిదుడు, నిగర్వ, సామ్యవాది, జీవితాంతం నమ్మిన విలువలకోసం కృషి చేసిన వ్యక్తి మహోన్నత మాతనవతా వాది ఫెర్నాండేజ్ చిరస్మరణీయుడు..

– బోస్



కుటుంబ సభ్యులతో జార్జి ఫెర్నాండేజ్



భార్య లైలాతో జార్జి



నివాళి అర్పిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



జార్జి భౌతిక కాయాన్ని చూడటానికి విచ్చేసిన ముఖ్య రాజకీయ నాయకులు



సహచరి జయజైట్లీతో జార్జి



మనవడితో జార్జి

# అమెరికాలోని తెలుగు విద్యార్థులకు సాయం చేస్తాం

## ఏపీ ఎన్ఆర్టీ






**రాజధాని వార్తలు, అమరావతి :** అమెరికాలో చదువుతున్న తెలుగు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఏపీ ఎన్ఆర్టీ అధ్యక్షుడు రవికుమార్ వేమూరి స్పష్టం చేశారు. తెలుగు విద్యార్థులను అరెస్టు చేస్తున్నారని వస్తున్న వార్తల నేపథ్యంలో ఆయన స్పందించారు. ఉన్నత చదువులు పూర్తి చేసిన విద్యార్థులు అక్కడి నుంచి రావడం ఇష్టం లేక కొన్ని గుర్తింపు లేని యూనివర్సిటీల్లో చదువుతున్నట్లు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారని, అలాంటి వారిని కట్టడి చేసేందుకు అమెరికా ప్రభుత్వం ఏటా రహస్య దర్యాప్తు చేపడుతోందన్నారు. ఆ దర్యాప్తులో భాగంగా 8 మంది తెలుగు విద్యార్థులు... ఇతర విద్యార్థులను నకిలీ యూనివర్సిటీల్లో చేర్పిస్తున్నట్లు అమెరికా ఆరోపిస్తుందన్నారు. అయితే, అందులో నిజానిజాలు తెలియాల్సి ఉందన్నారు. ఏపీ ఎన్ఆర్టీ తరఫున అమెరికాలోని తెలుగు విద్యార్థులకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తమ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేస్తే కావాల్సిన సమాచారం అందిస్తామని వెల్లడించారు. తెలుగు విద్యార్థులు విదేశాలకు వెళ్లేముందు అక్కడి చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, లేదంటే చిక్కుల్లో పడాల్సి వస్తుందని ఏపీ ఎన్ఆర్టీ సీఈవో కొడాలి భవానీశంకర్ అన్నారు.

### బాధిత విద్యార్థులకు 'నాటా' న్యాయసహాయం

**న్యూజెర్సీ :** ఫర్మింగ్‌టన్ ఫేక్ యూనివర్సిటీ వ్యవహారంలో అరెస్టయిన తెలుగు విద్యార్థులకు సాయం చేసేందుకు నార్త్ అమెరికన్ తెలుగు అసోషియేషన్ (నాటా) ముందుకొచ్చింది. ఫర్మింగ్‌టన్ యూనివర్సిటీ ఫేక్ అని తెలియక చాలా మంది విద్యార్థులు మోసపోయారని నాటా ప్రెసిడెంట్ డాక్టర్ గోసల రాఘవ రెడ్డి, కార్యదర్శి ఆళ్ళ రామిరెడ్డి అన్నారు. బాధితుల్లో ఎక్కువమంది తెలుగు విద్యార్థులే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### తల్లిదండ్రులు భయపడొద్దు..

అరెస్టయిన విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన పనిలేదని నాటా నాయకులు తెలిపారు. విచారరణ పూర్తయిన అనంతరం విద్యార్థుల భారత్‌కు పంపుతారని వెల్లడించారు. హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ శాఖ నిర్బంధంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని భరోసానిచ్చారు.

### 130 మంది అరెస్టు..

అమెరికాలో విద్యార్థి వీసాలపై అక్రమంగా ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటున్న విదేశీయులను పట్టుకునేందుకు ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ (ఐసీఈ) అధికారులు పార్మింగ్‌టన్ పేరుతో నకిలీ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం తెలిసిందే. ఈ వలలో చిక్కిన 8 మంది మధ్యవర్తులు (అందరూ తెలుగు వారే) ఇప్పటికే అరెస్టవ్వగా, తాజాగా 130 మంది విద్యార్థులు కూడా అరెస్టయ్యారు. 8 మందిపై వీసా సంబంధిత నేరపూరిత కుట్ర, లాభం కోసం అన్యులకు ఆశ్రయమివ్వడం తదితర అభియోగాలను నమోదు చేసిన అధికారులు, విద్యార్థుల పై మాత్రం కేవలం పౌర వలస నిబంధనల ఉల్లంఘన అభియోగంతో సరిపెట్టారు. అరెస్టైన 130 మంది విద్యార్థుల్లో 129 మంది భారతీయులేనని ఐసీఈ అధికార ప్రతినిధి ఖాలిద్ వాల్స్ చెప్పారు. వారిని భారత్‌కు తిరిగి పంపించేయనున్నామన్నారు.

### మీకు మేమున్నాం

**సెయింట్ లూయిస్:** నకిలీ ధ్రువపత్రాలతో అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారనే కారణంతో డెట్రాయిట్ పోలీసులు అరెస్ట్ చేసిన తెలుగు విద్యార్థులకు న్యాయ సహాయం అందించేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) ముందుకొచ్చింది. ఈ అరెస్టులు ప్రారంభం కాగానే చాలా మంది విద్యార్థులు నాట్స్ హెల్ప్ లైన్‌ను ఆశ్రయించటంతో నాట్స్ ఛైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ రంగంలోకి దిగారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com